లేనన్నాడు తండ్రి. ఎన్నో విధాల తండ్రికి చెప్పాడు. తల్లికికూడా చెప్పాడు. మొదట్లో యిద్దరూ అంగీకరించలేదు. కుటుంబ పరిస్థితులు నానాటికి అధ్వాన్న మవుతున్నాయి, రత్తాలు తండ్రికి తిరిగి చెప్పాడు. తాను చేపలకి వెళ్తానని, చివరకి తనతోటి బెస్తల్ని పిలిచి కొడుకుని అప్పగించాడు రాఘవులు కళ్లనీళ్లతో. అంతా ధైర్యంచెప్పారు. సింహం లాంటి కొడుకుని సముద్రములోకి పంపడానికి భయపడొద్దన్నారు.

రత్తాలు సముద్రంలోకి పడవమీద వెళ్లటం ప్రారంభించాడు. దిట్టమైన బెస్త. చేపలకేం కొదవ! కొల్లలుగా పట్టుకొస్తున్నాడు. సాయంత్రం అయ్యేటప్పటికి తల్లి రత్తమ్మ గట్టున కొడుక్కోసం కనురెప్ప వాల్చకుండా నిరీక్షించేది. గంపెడు చేపలు తెచ్చేవాడు రత్తాలు.

బజారు పట్టుకెళ్ళి అమ్ముకొచ్చేది కోటమ్మ కుటుంబం ఖర్చులకు రాబడి సరిపోయేది.

రాఘవులికి దగ్గు తగ్గలేదు. ఫైగా ముదిరింది. ఒకనాడు తండ్రి బందరు పెద్దాసుపత్రికి తీసుకెళ్లాడు రత్తాలు. పరీక్ష చెయ్యాలన్నారు డాక్టరు. ఎక్సురే ఫోటో తీశాడు. పెద్ద డాక్టరు నిట్టూర్చాడు. క్షయ అంకురించింది. మదనపల్లి గాని మద్రాసు గాని తీసుకువెళ్లమని సలహా ఇచ్చారు

రాఘవులకి యిదివరకే అనుమానంవుంది, లోలోపల బాధ పడుతున్నాడేగాని ఎవ్వరికీ చెప్పలేదు. పెద డాక్టరు ఒక్కసారి కుండబద్దలు కొట్టినట్టు చెప్పడంతో రాత్తాలుకీ, తల్లికి కడుపు చెరువులయిపోయాయి.

తిరిగి ఇల్లుచేరుకున్నారు, బరువు గుండెలతో, తండ్రిని రక్షించుకోవడం తలధర్మం అని తెలుసుకున్నాడు రత్తాలు. కాని అంతా డబ్బుతో పని, రాఘవులు కూడా ఆ విషయంగురించే బాధపడతున్నాడు.

